# పుత్తడి @ 92,150

**చారిత్రక గరిష్ఠ స్థాయికి ధర • రూ.1,100 పెరిగిన తులం విలువ**

న్యూఢిల్లీ, మార్చి 28: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. ఇప్పటికే సామాన్యుడికి అందని స్థాయికి చేరుకున్న పుత్తడి విలువ మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర రూ.92 వేల మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ నెలకొనడంతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై సుంకాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా తమ పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకాయి. ఇదే క్రమంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర శుక్రవారం ఒకేరోజు రూ.1,100 ఎగబాకి రూ.92,150 పలికింది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గురువారం ఈ ధర రూ.91,050గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.1,100 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.91,700కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లోనూ గోల్డ్ ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.1,140 ఎగబాకి రూ.90,980కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.1,050 అధికమై రూ.83,400 పలికింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బంగారం ధర రూ.23,730 లేదా 35 శాతం ఎగబాకింది. గతేడాది ఏప్రిల్ 1న తులం ధర రూ.68,420గా ఉన్నది.

### పుత్తడి బాటలోనే వెండి

వెండి ధరలు భారీగా పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.1,300 అందుకొని రూ.1,03,000కి చేరుకున్నది. అంతర్జాతీయ దేశాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలు నెలకొనడం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన చిక్కులు ఎదురుకావడం బంగారం ధరలు రివ్వున ఎగరడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు.

# కీలక రంగాలు కుదేలు

**గత నెల భారీగా మందగించిన వృద్ధిరేటు • ఫిబ్రవరిలో 2.9 శాతంగానే నమోదు • 5 నెలల కనిష్ఠం**

**తగ్గిన ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి • బొగ్గు, రిఫైనరీ, ఉక్కు, విద్యుత్తు రంగాలూ అంతంతే**

న్యూఢిల్లీ, మార్చి 28: దేశంలోని కీలక రంగాలు కుదేలయ్యాయి. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, విద్యుత్తు రంగాల్లో వృద్ధిరేటు గత నెల ఫిబ్రవరిలో మందగించడంతో మౌలిక రంగ ప్రగతి 5 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 2.9 శాతానికే పరిమితమైంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇది 7.1 శాతంగా ఉండటం గమనార్హం. ఈ మేరకు శుక్రవారం అధికారిక గణాంకాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది జనవరిలో కూడా 5.1 శాతంగా వృద్ధి నమోదైంది. కానీ ఫిబ్రవరిలో చాలా చాలా నిరుత్సాహకరంగా కనిపించింది. గతంతో పోల్చితే ఇంకా తగ్గింది. ఇక నిరుడు సెప్టెంబర్‌లో 2.4 శాతంగా మౌలిక రంగ వృద్ధి రేటు ఉన్నది. మళ్లీ ఆ తర్వాతి స్థాయి ఫిబ్రవరిలో నేనని తాజా లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి.

### దిగాలుపడ్డ ఇంధన రంగం

మొత్తం 8 కీలక రంగాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి దారుణంగా దెబ్బతిన్నది. మైనస్‌లోకి వెళ్లిపోయాయి. ఇప్పటికే దేశ ఇంధన అవసరాలు దాదాపు 80 శాతం విదేశీ దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఈ క్రమంలో దేశీయంగా ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి పడిపోతుండటం దేశానికి అన్నివిధాలుగా ఇబ్బందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఇంధన ఉత్పత్తి పుంజుకోకపోతే భారత ఆర్థిక వ్యవస్థకే ప్రమాదమని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, దాన్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మళ్లీ వడ్డీరేట్లను పెంచుతూపోవడం, తద్వారా బ్యాంకు రుణాలపై వడ్డీరేట్లు పెరిగి వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి కుంటుపడటం, పెరిగే ముడి చమురు దిగుమతులతో దేశంలోని విదేశీ మారకపు నిల్వలు క్షీణించడం.. ఇలా అనేకానేక సమస్యలు వచ్చిపడుతాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాబట్టి ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి తిరిగి పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

### ఇతర రంగాల్లో..

బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, విద్యుదుత్పత్తి రంగాలు కూడా నిరాశాజనకంగానే సాగుతున్నాయి. గత నెల బొగ్గు ఉత్పత్తి 1.7 శాతం, రిఫైనరీ ఉత్పాదక కార్యకలాపాలు 0.8 శాతం, ఉక్కు తయారీ 5.6 శాతం, విద్యుదుత్పత్తి 2.8 శాతం మేరకే పెరిగాయి. అయితే నిరుడు ఫిబ్రవరిలో ఇవి వరుసగా 11.6 శాతం, 2.6 శాతం, 9.4 శాతం, 7.6 శాతం చొప్పున వృద్ధిని కనబర్చాయి. నిజానికి ఈసారి ఎరువులు, సిమెంట్ ఉత్పత్తి జోరుగా సాగింది. గతంతో పోల్చితే 10.2 శాతం, 10.5 శాతం చొప్పున పెరిగింది. అయినప్పటికీ ముడి చమురు, సహజ వాయువుల ఉత్పత్తి దిగజారడం.. బొగ్గు, రిఫైనరీ , ఉక్కు, విద్యుదుత్పత్తి అంతంతమాత్రంగానే ఉండటంతో ఆ పెరుగుదల ప్రభావం చూపలేకపోయింది.

### ఈ ఆర్థిక సంవత్సరంలోనూ..

గత ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ కీలక రంగాల పనితీరు నిరుత్సాహకరంగానే కొనసాగుతున్నది. ఈసారి ఏప్రిల్-ఫిబ్రవరిలో 8 కీలక రంగాల్లో ప్రగతి 4.4 శాతంగానే ఉంటే.. పోయినసారి 7.8 శాతంగా ఉన్నది మరి. దీంతో ఆయా రంగాల్లో నిస్తేజం ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, విద్యుత్తు, ఎరువులు, సిమెంట్ రంగాల వాటా దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఏకంగా 40.27 శాతం. దీంతో ఈ రంగాల్లో మందగమనం.. యావత్తు ఇండస్ట్రీ తీరుతెన్నులను, దేశ జీడీపీ గణాంకాలనూ పెద్ద ఎత్తునే ప్రభావితం చేసే వీలున్నది. దాంతో వీటి వృద్ధిపై దృష్టి సారించాలన్న సూచనలు ఇప్పుడు మోదీ సర్కారుకు వస్తున్నాయి.

### ఎల్ఐసీ ఆఫీస్‌లు ఒపెన్

న్యూఢిల్లీ, మార్చి 28: జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ కార్యాలయాలు కూడా శని, ఆది, సోమవారాలు తెరిచివుండనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా పాలసీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాలు యథావిధిగా పనిచేయనున్నాయని ఒక ప్రకటనలో సంస్థ వెల్లడించింది.

### చిన్న మొత్తాలపై వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ, మార్చి 28: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు గత వడ్డీరేట్లు కొనసాగించనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

### ఆరా ఇన్‌ఫ్రాకు అవార్డు

న్యూఢిల్లీ, మార్చి 28: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న ఆరా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌ను.. బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి ఎర్లీ ఆపరేషనలైజేషన్ విభాగంలో ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించింది. ఈ అవార్డును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నుంచి కంపెనీ ప్రతినిధి సంజయ్ వినోద్ మిశ్రా అందుకున్నారు.

### బ్రిటన్‌కు మిట్టల్ గుడ్‌బై?

లండన్, మార్చి 28: భారత్‌కు చెందిన బిలియనీర్, ఉక్కు తయారీ రంగ దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ సంస్థ అధినేత లక్ష్మీ మిట్టల్.. బ్రిటన్‌కు గుడ్‌బై చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు 3 దశాబ్దాలుగా బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఉంటున్న మిట్టల్‌కు.. పన్నులకు సంబంధించి అక్కడి ప్రభుత్వ నిర్ణయం సెగ తగులుతున్నది. దీంతో దుబాయ్, స్విట్జర్లాండ్, ఇటలీలకు వెళ్లిపోవాలని మిట్టల్ యోచిస్తున్నట్టు సమాచారం. అక్కడ సంపన్నులకు పన్ను ప్రోత్సాహకాలున్నాయి. కాగా, బ్రిటన్‌లో ఉన్నప్పటికీ వారి శాశ్వత నివాసం ఇతర దేశాల్లో ఉంటే.. విదేశీ ఆదాయంపై బ్రిటన్‌లో వారు పన్నులు కట్టనక్కర్లేదు. అయితే దీన్ని వచ్చే నెల నుంచి రద్దు చేస్తున్నట్టు బ్రిటన్ సర్కారు ప్రకటించింది. ఫలితంగా మిట్టల్‌పై పన్ను భారం తప్పేట్లు లేదు.

# రూ.25.90 లక్షల కోట్లు

- **ఈ ఆర్థిక సంవత్సరం పెరిగిన మదుపరుల సంపద**
- **5 శాతానికిపైగా పుంజుకున్న బీఎస్ఈ సెన్సెక్స్**

ముంబై, మార్చి 28: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.25.90 లక్షల కోట్లకుపై గా ఎగిసింది. మంగళవారం నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26) మొదలుకానుండగా.. శుక్రవారంతో ఈ ఆర్థిక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లకు చివరి ట్రేడింగ్ రోజు ముగిసింది. దీంతో గడిచిన ఏడాది కాలంలో బీఎస్ఈలోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద రూ.25,90,546.73 కోట్లు పెరిగి రూ.4,12,87,646.50 కోట్లకు చేరినట్టు తేలింది. ఇదే సమయంలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 3,763.57 పాయింట్లు లేదా 5.10 శాతం ఎగబాకింది. అయితే గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే మాత్రం ఇది తక్కువే. నాడు 14,659.83 పాయింట్లు (24.85 శాతం) పుంజుకున్నది. మదుపరుల సంపద రూ.128,77,203.77 కోట్లు పెరిగింది. ఇది లావుంటే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ ఈ ఆర్థిక సంవత్సరం 1,192.45 పాయింట్లు లేదా 5.34 శాతం లాభపడింది. మరోవైపు శుక్రవారం సెన్సెక్స్ 191.51 పాయింట్లు పడిపోయి 77,414.92 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 420.81 పాయింట్లు పతనమైంది. ఇక నిఫ్టీ కూడా 72.60 పాయింట్లు కోల్పోయి 23,519.35 వద్ద స్థిరపడింది.

### జీఎస్టీపై వడ్డీ మాఫీ గడువు 31

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మదింపు చేసిన పన్ను మొత్తాన్ని ఈ నెల 31లోపు చెల్లించి జరిమానా, వడ్డీ నుంచి మినహాయింపు పొందాలని సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపాల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, స్టేట్ జీఎస్టీ కమిషనర్ హరిత సూచించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తొలి మూడేండ్లలో వివిధ సాంకేతిక సమస్యల వల్ల పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. దీంతో 2017-20 సంవత్సరాలకు మదింపు చేసిన పన్ను మొత్తాన్ని ఈ నెల 31లోపు చెల్లించిన వారికి పెనాల్టీ, వడ్డీలు మాఫీ కాగలవన్నారు. పన్ను చెల్లించినవారు ఈ ఏడాది జూన్ 30లోగా జీఎస్టీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

# ఏటీఎం చార్జీల మోత

- **ప్రతి నెలా ఉచిత నగదు ఉపసంహరణలు దాటితే ఒక్కో లావాదేవీపై ఇక రూ.23 వసూలు**
- **బ్యాంకులకు ఆర్బీఐ అనుమతి**
- **మే 1 నుంచి అమలు**

ముంబై, మార్చి 28: నగదు అవసరం ఉన్నప్పుడల్లా కనిపించిన ఏటీఎంల్లోకి వెళ్లి కార్డులను ఎడాపెడా వాడేస్తున్నారా?.. అయితే ఇక మీదట జాగ్రత్తగా ఉండకపోతే మరింతగా నష్టపోవాల్సి వస్తుంది. అవును.. ఏటీఎం చార్జీలను పెంచుకొనేందుకు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం అనుమతి ఇచ్చింది మరి. ప్రతి నెలా ఉచిత నగదు ఉపసంహరణలకున్న పరిమితి దాటితే ఒక్కో నగదు ఉపసంహరణకు రూ.23 చార్జీ పడనున్నది. మే 1 నుంచి ఈ కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పుడు ఈ చార్జీ రూ.21గా ఉన్నది. కానీ దీనికి అదనంగా మరో రూ.2 పెంచుకోవచ్చని బ్యాంకులకు ఆర్బీఐ ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

### ఇదీ సంగతి..

బ్యాంక్ ఖాతాదారులు ప్రతి నెలా తమకు ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంల్లో ఐదుసార్లు ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలను ఉచితంగానే జరుపుకోవచ్చు. అలాగే ఇతర బ్యాంక్ ఏటీఎంల్లో మూడుసార్లు (హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో) ఈ లావాదేవీలను ఉచితంగా చేసుకోవచ్చు. నాన్ మెట్రో నగరాల్లోనైతే ఐదుసార్లు ఫ్రీ. అయితే ఈ పరిమితులు దాటితే రూ.21 చార్జీ వేస్తున్నారు.

### రంజాన్ రోజూ బ్యాంకులకు పనిదినమే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగిసే రోజు కావడంతో రంజాన్ పర్వదిన మైనప్పటికీ మార్చి 31 (సోమవారం)న బ్యాంకులు యథాతథంగానే పనిచేయనున్నాయి. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు ఆర్బీఐ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. సాధారణంగా రంజాన్ పండుగకు బ్యాంకులకు సెలవు. అయితే ఆర్థిక సంవత్సరానికి చివరి రోజు కావడంతో ఆదాయ పన్ను (ఐటీ), వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఇతర ప్రభుత్వ-ప్రైవేట్ లావాదేవీలు, చెల్లింపులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా బ్యాంకులు పనిచేయబోతున్నాయి. నిజానికి శని, ఆది, సోమవారాల్లో దేశవ్యాప్తంగా అన్ని ఐటీ ఆఫీసులు, సీజీఎస్టీ కార్యాలయాలు పనిచేయనున్నట్టు ఆయా శాఖలు ప్రకటించాయి. ఇక సోమవారం చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్) కింద స్పెషల్ క్లియరింగ్ ఆపరేషన్స్‌నూ బ్యాంకులు నిర్వహించాలని ఆర్బీఐ ఆదేశించింది. ప్రజెంటేషన్ టైం సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటలదాకా, రిటర్న్ టైం సెషన్ రాత్రి 7 గంటల నుంచి 7:30 గంటల వరకు ఉంటుంది.

ఎంబీబీఎస్ పూర్తిచేసిన గ్రాడ్యుయేట్‌కు పట్టా ప్రదానం చేస్తున్న కాళోజీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్‌రెడ్డి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడ నయన్‌రాజ్ తదితరులు

# సేవాభావంతో వైద్య సేవలు అందించాలి

- **కాళోజీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్‌రెడ్డి**
- **ఘనంగా మమత మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే**

దుండిగల్, మార్చి 28 : రోగులకు సేవాభావంతో వైద్యసేవలు అందించాలని కాళోజీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్స్‌లో శుక్రవారం ఎంబీబీఎస్ (2019 బ్యాచ్) పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. నందకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎంబీబీఎస్ పూర్తిచేసిన 133 మంది, నర్సింగ్ పూర్తిచేసిన 42 మందికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నయన్‌రాజ్, డీన్ హరికృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్ పటేల్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ ప్రణీత్‌కుమార్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# రాబోయే 4 రోజులు 44 డిగ్రీలు నమోదు

- **ప్రస్తుతం 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు**
- **25 జిల్లాలకు ఆరెంజ్‌అలర్ట్**
- **ఉమ్మడి నల్లగొండలోనిప్పులు**
- **హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

హైదరాబాద్, మార్చి 28 (నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజులు ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి ధర్మరాజు తెలిపారు. 25 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. శుక్రవారం ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్‌లో సాధారణం కంటే ఒక డిగ్రీ అధికంగా నమోదైందని పేర్కొన్నారు. పశ్చిమ జిల్లాల్లో 36 డిగ్రీల నుంచి 40వరకు నమోదయ్యే అవకాశం ఉందని, హైదరాబాద్‌లో సాధారణం కంటే ఒక డిగ్రీ అధికంగా నమోదవుతుందని వివరించారు. మార్చి నెలాఖరు నుంచి వడగాల్పులు వీచే అవకాశముందని, ఏప్రిల్‌లో అధిక వేడిమి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల తర్వాత తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాపై భానుడు నిప్పులు కురిపిస్తున్నాడని, నాలుగు రోజుల నుంచి పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు అధికారులు తెలిపారు. శుక్రవారం అత్యధికంగా నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 20 ప్రాంతాల్లో 41 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా జిల్లాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. సూర్యాపేట జిల్లాలో 3, యాదాద్రి జిల్లాలో 13 ప్రాంతాల్లో 40 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని తెలిపారు.

# వడదెబ్బతో రైతు కూలీ మృతి

శంకర్ (ఫైల్)

భైంసా, మార్చి, 28 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణం కిసాన్‌గల్లీకి చెందిన కత్తి గమోళ్ల శంకర్ (52) రైతు కూలీ శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఓ రైతు వద్ద మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టేందుకు నాలుగైదు రోజుల నుంచి కూలి పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం పంటకు నీరు అందిస్తుండగా చేనులో అస్వస్థతకు గురయ్యాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

# ఎండకాలంలో సర్దీ

- **దవాఖానలకు భారీగా పోటెత్తుతున్న వ్యాధి బాధితులు**
- **కలుషిత ఆహారం, పానీయాలతో బ్యాక్టీరియా వ్యాప్తి**
- **యాత్రలు చేసేవాళ్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
- **బయట ఆహారం తినకపోవడమే మంచిది: వైద్యులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్కడ చూసినా చాలా మందిలో దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నవారు కనిపిస్తున్నారు. అస్వస్థతతో రోగులు దవాఖానల బాట పడుతున్నారు. సాధారణంగా వాన, చలికాలాల్లో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తాయి. కానీ ఇప్పుడు ఎండాకాలంలోనూ కొన్ని రకాల బ్యాక్టీరియాల కారణంగా ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా వైరల్ జ్వరం కేసులు పెరుగుతున్నాయి. ప్రధానమైన దవాఖానలతో పాటు బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీలు, ఏరియా దవాఖానలకు కోల్డ్ ఎలర్జీతో రోగుల తాకిడీ ఎక్కువయింది.

### పొంచి ఉన్న కలరా ముప్పు?

వేసవిలో బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందుతుంది. ఆహార పదార్థాలు ఎక్కువసేపు నిల్వ ఉండవు. ఉదయం వండిన ఆహార పదార్థాలు మధ్యాహ్నానికే పాడవుతాయి. ఆహారంలోని బ్యాక్టీరియా అధిక ఉష్ణోగ్రతలతో వేగంగా వృద్ధి చెందుతుంది. నిల్వ చేసిన, కలుషిత ఆహారం వల్ల టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-ఎ, హెపటైటిస్-ఇ (కామెర్లు) తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వేసవిలో కలుషిత ఆహార పదార్థాలు, కలుషిత నీటి వల్ల కలరా బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సకాలంలో సరైన వైద్యం అందించకపోతే అది ప్రాణాలకే ప్రమాదకరం. అత్యధికంగా విరేచనాలు కావడం వల్ల శరీరంలో నుంచి నీరు, లవణాలు బయటకు పోవడంతో డీహైడ్రేషన్‌కు గురవుతారు. రోగిలో బీపీ పడిపోతుంది. కిడ్నీలు, గుండె పనితీరు దెబ్బతింటుంది. రోగులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారని వైద్యులు చెప్తున్నారు.

### కోల్డ్ ఎలర్జీకి కారణమయ్యే ఆహారాలు

- కలుషితమైన చల్లని పానీయాలు
- కలుషిత ఐస్‌క్యూబ్స్, ఐస్‌క్రీమ్స్, పళ్ల రసాలు, షర్బత్‌లు
- ఫ్రిడ్జ్‌లో పెట్టి, తిరిగి వేడి చేసిన ఆహారం, నిల్వ ఉంచిన పదార్థాలు

### కోల్డ్ ఎలర్జీ లక్షణాలు

- జలుబు, సుదీర్ఘకాలం దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు,
- నీరసం, వాంతులు, విరేచనాలు, రైస్ వాటర్ స్టూల్(తెల్లటి విరేచనాలు).

### దవాఖానల్లో కోల్డ్ ఎలర్జీ కేసుల వివరాలు

| హాస్పిటల్ | పెరిగిన ఓపీ శాతం | కలరా కేసులు | అక్యూట్ డయేరియా కేసులు |
|---|---|---|---|
| ఫీవర్‌హాస్పిటల్ | 40 | 1 | 58 |
| ఉస్మానియా | 29.3 | 3 | 60 |
| గాంధీ | 32 | 1 | 48 |
| నిలోఫర్ | - | 0 | 33 |

## కలుషిత ఆహారంతో కోల్డ్ అలర్జీ

వేసవి సెలవులు కావడంతో చాలామంది వివిధ యాత్రలకు వెళ్లి వస్తుంటారు. ఇలాంటి సమయంలో కొత్త ప్రాంతాల్లో ఆహారం పట్ల జాగ్రత్తలు అవసరం. కలుషిత ఆహారం, నీరు కారణంగా ఎలర్జీకి గురయ్యే ప్రమాదముంటుంది. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలతో దవాఖానకు వచ్చే వారి సంఖ్య పెరిగింది. వారిలో ఇటీవల యాత్రలు చేసినవాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. వేసవిలో వైరస్‌ల ప్రభావం పెద్దగా ఉండదు. కానీ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. నిల్వ ఆహారాలు తీసుకున్నప్పుడు కలరా, టైఫాయిడ్ వ్యాధుల బారినపడే ప్రమాదముంది. ప్రజలు ఆహారం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. -డాక్టర్ రాజారావు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్

# మగబిడ్డ కోసం బాలికతో పెండ్లి

- **విచారణ చేపట్టిన ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ అధికారులు**
- **బాలికను బాలసదనానికి తరలింపు**
- **మెదక్ జిల్లా కాట్రియాల గిరిజన తండాలో ఘటన**

రామాయంపేట, మార్చి 28: మగ బిడ్డ కోసం ఓ వ్యక్తి బాలికను పెండ్లి చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు, పోలీసుల కథనం ప్రకారం...మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గిరిజన తండాకు చెందిన శివలాల్ తనకు ముగ్గురు ఆడపిల్లలు జన్మించడంతో మగ సంతానం కోసం పక్కనే మరో గిరిజన తండాకు చెందిన బాలికను (16) పది రోజుల క్రితం పెండ్లి చేసుకున్నాడు. ఈ విషయాన్ని తండాకు చెందిన కొంత మంది మహిళలు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మెదక్ నుంచి శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు రామాయంపేటకు చెందిన వివిధ శాఖల అధికారులు కాట్రియాల గిరిజన తండాకు వెళ్లి విచారణ చేపట్టారు. విచారణలో సంబంధిత వ్యక్తికి ముగ్గురు ఆడసంతానం ఉండడంతో, మగ సంతానం కోసం బాలికను పెండ్లి చేసుకున్నట్టు తేలింది. వెంటనే అధికారులు బాలికను మెదక్‌లోని బాలసదనానికి తీసుకెళ్లారు. శివలాల్‌పై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఆర్ఐ గౌస్ తెలిపారు.

- **ఇద్దరమ్మాయిలతో..!**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం గుంనూర్ (కే)కు చెందిన సిడాం సూర్యదేవ్.. పుల్లారా గ్రామానికి చెందిన జల్తారా దేవి, శెట్టి హడప్నూర్‌కు చెందిన లాల్‌దేవిని ప్రేమించాడు. యువతులిద్దరూ ఒత్తిడి చేయడంతో పెద్దల సమక్షంలో ఇద్దరినీ పెళ్లి చేసుకుంటానని, వారిని సమానంగా చూసుకుంటానని బాండ్ పేపర్‌పై రాసిచ్చాడు. 500 మంది అతిథుల సమక్షంలో వేదమంత్రాల సాక్షిగా పచ్చని పందిరిలో ఇద్దరి మెడలో తాళి కట్టాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. – కుమ్రం భీం ఆసిఫాబాద్/లింగాపూర్

### ఏసీబీకి చిక్కిన వైద్యారోగ్య శాఖ మాస్ మీడియా అధికారి

**రూ. 30 వే